క్లుప్తంగా

ఉచిత ప్రసాదం పంపిణీ



ఉచిత ప్రసాదం పంపిణీ చేస్తున్న పీతల వాసు తదితరులు

దాబాగార్డెన్స్ : మహాశివరాత్రిని పురస్కరించుకుని పుణ్యస్నానాలు చేసేందుకు బీచ్‌కు వచ్చే భక్తులకు 29వ వార్డు పందిమెట్ట జంక్షన్ వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు రాపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు పీతల వాసు, 28వ వార్డు నాయకుడు పల్లా దుర్గారావు, పల్లా కృష్ణ, నొడగల రాజు, నమ్మి రామకృష్ణ, కోరాడ వాసు, దువ్వి శివ, నొడగల అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా చినదుర్గాలమ్మ జాతర



చిన దుర్గాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అల్లిపురం : అచ్చియ్యమ్మపేటలో వెలసిన చిన దుర్గాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం శనివారం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారికి తెల్లవారి జాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. అచ్చియ్యమ్మపేట, కొబ్బరితోట, అల్లిపురం, మిరపకాయల వీధి, వెంకటేశ్వరమెట్ట తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎర్రిగెడ్డ కన్వేయర్ బెల్ట్ ప్రారంభం



కన్వేయర్ బెల్ట్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి ఎర్రిగెడ్డ ఆర్ అండ్ డి యార్డ్ వద్ద సుమారు రూ.1.89 కోట్లతో నిర్మించిన కన్వేయర్ బెల్ట్‌ను శనివారం జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ప్రారంభించారు. కార్యక్రమంలో జోన్–5 ఇంజినీరింగ్ ఈఈ ప్రసన్నరెడ్డి, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ అర్బన్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, వేళంగిణిరావు, కుమార్, అన్నపూర్ణ, దేవి, సురేష్‌కుమార్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్, కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ నైపుణ్యాలతో రాణించాలి

సీతంపేట: పోటీ ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులు బహుముఖ నైపుణ్యాలతో రాణించాలని ఆచార్య పి.ఎస్.అవధాని అన్నారు. అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాలలో శనివారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని స్టూడెంట్లకు సూచించారు. ఈ సందర్భంగా 8, 9 తరగతుల విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయినులు, మహిళా సిబ్బందిని సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వి.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఎస్.ఎల్.శైలజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వంకాయల సన్యాసిరాజు, రమేష్‌చంద్ జైన్, ఎం.వి.రాజశేఖర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



జగనన్న ఆశయం.. పేదలందరికీ వైద్యం

- చక్కటి సేవలందిస్తున్న **27వ వార్డులోని** డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం
- 63 రకాల టెస్టులు.. వైద్యంతో పాటు ఉచితంగా మందుల అందజేత
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పేదల ఆరోగ్యం కోసం సీఎం జగన్ ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారు. అడుగడుక్కి వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల అందుబాటులోకే కార్పొరేట్ స్థాయి వైద్యం తీసుకొచ్చారు. దీంతో ఒకప్పుడు రోగాల బారిన పడితే వేలు, లక్షలు ఖర్చు చేసే బాధ పేదలకు తప్పింది. ఈ నేపథ్యంలో 27వ వార్డు దొండపర్తిలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం పేదలకు 63 రకాల టెస్టులు, వైద్యం అందజేస్తూ ఇతోధికంగా సేవలందిస్తోంది. అలాగే ఉచితంగా మందులు కూడా ఇస్తూ జగనన్న ఆశయస్ఫూర్తిని నూటికి నూరు శాతం అమలు చేస్తోంది.

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు షిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలోని దొండపర్తి వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రజలకు చక్కటి సేవలందిస్తోంది. 2022 అక్టోబర్ 21న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఈ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెడికల్ ఆఫీసర్, ల్యాబ్ అసిస్టెంట్, స్టాఫ్ నర్సులు, ఎల్‌జీఎస్, వైద్య సిబ్బంది ఇక్కడ సేవలందిస్తున్నారు. రోజుకు సుమారు 50 నుంచి 60 మంది వరకు రోగులు వస్తుంటారు. అలాగే 30 నుంచి 40 మంది పలు రకాల టెస్టులు



2022లో యూపీహెచ్‌సీని ప్రారంభిస్తున్న ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని (ఫైల్)



దొండపర్తిలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

చేయించుకుంటారు. ఈ ఆరోగ్య కేంద్రంలో మొత్తం 63 టెస్టులు అందుబాటులో ఉన్నాయి. మలేరియా, డెంగ్యూ, హెచ్‌బీ, కిడ్నీ తదితర వ్యాధులతో పాటు వ్యాధుల నిర్ధారణకు సంబంధించి ఇతర టెస్టులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. కొత్తగా ల్యాబ్ టెస్ట్ మిషన్ అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ కరోనా టెస్ట్‌లు కూడా చేసి పాజిటివ్ గనుక వస్తే వారికి కిట్లు అందించి పర్యవేక్షణలో ఉంచుతారు. ప్రతి శనివారం, బుధవారం గర్భిణులు, పిల్లలకు వ్యాక్సిన్ వేస్తుంటారు. ఇక్కడ సోమవారం ఆర్థోపెడిక్ వైద్యుడు కె.రాకేష్, మంగళవారం స్కిన్ డాక్టర్ రమ్యకృష్ణ, బుధవారం గైనకాలజిస్ట్ శిరీష, గురువారం ఛాతీ వైద్య నిపుణురాలు డాక్టర్ రూప, శుక్రవారం జనరల్ సర్జన్లు డాక్టర్ మహరాజ్, డాక్టర్ ఠాగూర్, శనివారం ఈఎన్‌టీ వైద్యురాలు స్రవంతి రోగులకు సేవలందిస్తారు. 25వ వార్డుకు సంబంధించి రెండు సచివాలయాలు, 27వ వార్డుకు సంబంధించి ఆరు సచివాలయాలు కలిపి.. మొత్తం 8 సచివాలయాల పరిధిలోకి వచ్చే ప్రజలు ఈ ఆరోగ్య కేంద్రం సేవలందుకుంటున్నారు. వారే కాకుండా నగరంలోని ఇతర ప్రాంతాల వారు కూడా ఇక్కడ వైద్యులు, సిబ్బంది సేవలు అందుకుంటున్నారు. ఇక్కడ ప్రధాన వైద్యురాలు డాక్టర్ స్రవంతి, 9 మంది ఏఎన్‌ఎంలు, 10 మంది ఆశ వర్కర్లు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక డీఈఓ, ఒక ఎల్‌ఎస్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ యూపీహెచ్‌సీలో పది పడకలు అందుబాటులో ఉన్నాయి.



బ్లడ్ టెస్ట్ చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



సేవలందిస్తున్న వైద్యురాలు డాక్టర్ శ్రావణి షారోన్

వివిధ పరీక్షలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- గుండె సంబంధిత పరీక్షలకు సీరం కొలెస్ట్రాల్, సీరం ట్రైగ్లిసరైడ్స్, వీఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్, ఐడీఎల్ కొలెస్ట్రాల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలకు ఆహార, పానీయాలు తీసుకోకుండా రావలసి ఉంటుంది.
- లివర్‌కు సంబంధించి సీరం టోటల్ బైలురుబిన్, సీరం డైరెక్ట్ బైలురుబిన్, ఇండైరెక్టు బైలురుబిన్, ఎంజోమెటిక్ టెస్ట్, సీరం అల్బుమిన్ తదితర పరీక్షలు చేస్తారు.
- కిడ్నీ వ్యాధికి సంబంధించి క్రియాటినిన్, యూరిక్ యాసిడ్, యుఆర్‌ఈఏ, సోడియం, పొటాషియం, ఫాస్ఫేట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షలకు ఏ సమయంలోనైనా రావచ్చు.
- డయాబెటిక్‌కు సంబంధించి ఏమీ తీసుకోకుండా రావాలి. పోస్ట్ పాంక్రియల్, బ్లడ్ షుగర్ ర్యాండం, బ్లడ్ షుగర్ ప్రెగ్నెన్సీ, జీటీటీ గ్లూకోస్ టోలెరెన్స్ టెస్ట్ చేస్తారు.
- హెమోగ్లోబిన్, హెచ్‌ఐవీ, హెచ్‌బీఎస్‌ఏజీ, హెచ్‌సీవీ, వీడీఆర్‌ఎల్, బ్లీడింగ్ టైం, బ్లడ్ గ్రూప్ టెస్ట్, కఫం, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, కంప్లీట్ బ్లడ్ కౌంట్‌తో పాటు మరెన్నో పరీక్షలు ఇక్కడ నిర్వహిస్తున్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి..



డాక్టర్ వైఎస్‌ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ద్వారా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని వైద్య సేవలు అందిస్తున్నాం. అలాగే 63 రకాల టెస్టులు ఉచితంగా చేసి మందులు ఇస్తున్నాం. ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటున్నాం. అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ శ్రావణి షారోన్,
మెడికల్ ఆఫీసర్, దొండపర్తి యూపీహెచ్‌సీ–2

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు..



దొండపర్తిలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం మాలాంటి పేదలకు చక్కటి సేవలందిస్తోంది. ఇక్కడ పరీక్షలు, వైద్యం, మందులు ఉచితంగా అందజేస్తుండడంతో వైద్యం కోసం వేలు ఖర్చు చేయాల్సిన భారం తప్పింది. ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు.

–పి.రమణమ్మ, దొండపర్తి

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

దాబాగార్డెన్స్ : మహావీర్ ఇంటర్నేషనల్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ వద్ద గల మహావీర్ ఇంటర్నేషనల్ చారిటబుల్ క్లినిక్ వద్ద ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ ఉచిత శిబిరం ఉంటుందన్నారు. ప్రముఖ కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, ఆప్తాల్మజిస్ట్, డెంటిస్ట్, ఈఎన్‌టీ, ఫిజియోథెరపిస్ట్, ఆక్యుప్రెషరిస్ట్, ఎలక్ట్రో హోమియోపతిస్ట్, ఆయుర్వేదిక్, హోమియోపతిక్‌తో పాటు జనరల్ ఫిజీషియన్ శిబిరంలో సలహాలు, వైద్యం, ఉచితంగా మందులు అందజేయనున్నారని చెప్పారు. మరిన్ని వివరాలకు 9803040152, 9700105058 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వలంటీర్ మృతికి సంతాపం



దహన ఖర్చుల కోసం ఆర్థిక సాయం చేస్తున్న మేరీజోన్స్, రాజు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 36వ వార్డు దిగువ రెల్లి వీధి, శబరినగర్‌కు చెందిన సచివాలయ వలంటీర్ వడ్డాది లావణ్య గుండెకు సంబంధించిన వ్యాధితో శనివారం మృతి చెందిన విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ మేరీజోన్స్, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు మాసిపోగు రాజు సంతాపం తెలిపారు. దహన ఖర్చుల కోసం ఆమె కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం తోమాల సేవ జరిపారు.
సహస్ర నామార్చన, అష్టోత్తరం, దూపసేవ, దీపోత్సవం చేశారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులందరికీ ప్రసాద వితరణ చేపట్టారు.

రేణుక యల్లమ్మ ఉత్సవానికి ఆహ్వానం



కోలా గురువులు, డాక్టర్ రమణమూర్తికి ఆహ్వానం పలుకుతున్న కమిటీ సభ్యులు

అల్లిపురం : కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వేంచేసిన శ్రీ రేణుక యల్లమ్మ అమ్మవారి ఉత్సవానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కళా ఆస్పత్రి అధినేత పీవీ రమణమూర్తికి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానం పలికారు. ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, ముఖ్య సలహాదారు బొడ్డేటి ప్రసాద్, కార్యదర్శి బొడ్డు పోలారావు, కార్యవర్గ సభ్యులు వాసుపల్లి నారాయణ, శ్రీను, గనగళ్ల సత్యవతి, దున్నబోయిన సత్యనారాయణ, బడే నాగరాజు, ఆలయ అర్చకుడు కొడమంచిలి కామేశ్వరశర్మ ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించే ఉత్సవాల బ్రోచర్‌ను అందజేసి ఆహ్వానం పలికారు.

సేవామూర్తులకు సత్కారం



మహిళలను సత్కరిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్ తదితరులు

జగదాంబ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్వామి వివేకానంద సంస్థలో సేవలందిస్తున్న పలువురు మహిళలను సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్, వీవీ రమణమూర్తి, మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ జహీర్ అహ్మద్ మాట్లాడుతూ ఇంటిని, పిల్లల్ని చూసుకుంటూ సంస్థలో అలుపెరుగని సేవ చేస్తున్న మహిళలను సత్కరించడం గర్వకారణంగా ఉందన్నారు. కరోనా వంటి ప్రమాదకర పరిస్థితిలో కూడా మహిళలు సేవలందించారని కొనియాడారు. వివేకానంద సంస్థలో సేవే పరమార్థంగా పని చేస్తున్న మహిళలను వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు, టి.కృష్ణ, పైడిరత్నం తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సామూహిక రుద్రాభిషేకం



విశేష అలంకరణలో ఉమా చంద్రమౌళీశ్వరస్వామి

అల్లిపురం : అస్పాం గార్డెన్స్‌లో గల శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం లింగోద్భవ కాలంలో పరమ శివునికి మహాన్యాసపూర్వక సామూహిక రుద్రాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, విభూది, గంధం, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో రుద్రాభిషేకాన్ని ఋత్విక్కులు చేపట్టారు. అనంతరం ఉమాచంద్రమౌళీశ్వరస్వామిని విశేషంగా అలంకరించి ఏక హారతి నుంచి నక్షత్ర హారతి, కర్పూర హారతి వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మహిళలకు ఆదర్శం సావిత్రిబాయి పూలే



పూలే వయోజయ విద్యా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రమణమూర్తి

మద్రిపాలెం: దేశ తొలి ఉపాధ్యాయిని, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలేను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని లీడర్ పత్రికా సంపాదకుడు వి.వి.రమణమూర్తి అన్నారు. ఆర్ అండ్ బీ దరి ఏకలవ్య కాలనీలో మురికివాడల నివాస సంఘం, ప్రగతి శీలా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే వయోజన విద్యా కేంద్రాన్ని శనివారం ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన అభినందన సభలో రమణమూర్తి మాట్లాడుతూ అనేక పోరాటాలతో భూకబ్జాదారుల దాడులు, దౌర్జన్యాలపై పోరాడి నివాస హక్కును సుస్థిరం చేసుకుంటున్న ఏకలవ్య కాలనీవాసులను అభినందించారు. మరో అతిథి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ యువత చెడు మార్గం నుంచి బయటపడి విజ్ఞానవంతులని కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చైతన్య మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లలిత, విద్యా పరిరక్షణ కమిటీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ విస్తరణ పనులు జోరుగా జరుగుతున్నాయి. హైవే కూడలి నుంచి మహారాణి పార్లర్ వరకు 80 అడుగుల విస్తరణ చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ నిర్మించారు. రోడ్ మధ్యలో నిర్మించిన సెంటర్ మీడియన్‌పై ఎల్‌ఈడీ విద్యుత్ దీప స్తంభాలు ఏర్పాటు చేశారు. దీంతో ఈ మార్గంలో రహదారి విస్తరణ పనులు దాదాపు పూర్తి కావడంతో మెయిన్ రోడ్ కొత్త అందాలతో ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం మహారాణి పార్లర్ కూడలి నుంచి దొండపర్తి కూడలి వరకు 60 అడుగుల రోడ్డుగా విస్తరణ పనులు జరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు తీరినట్టేనని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

- ముగిసిన పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ వార్షిక జాతర
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలి వచ్చిన భక్తులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున ప్రసాద వితరణ



పూర్ణామార్కెట్ ఏరియాలో దుర్గాలమ్మ ఊరేగింపు



అమ్మవారి జాతరలో భక్తజన సందోహం

దాబాగార్డెన్స్ : పూర్ణామార్కెట్ దరి వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం జాతరను పురస్కరించుకుని ఆలయానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత అమ్మవారికి వైభవంగా నేత్రోత్సవం, తొలిపూజ నిర్వహించారు. వేకువ జాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భవానీ మాలలు వేసిన మాతలు కలశాలతో పసుపు కుంకుమ నీళ్లతో ఊరేగింపుగా ఆలయానికి విచ్చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో అగ్నిగుండాలు తొక్కే కార్యక్రమం జరిపారు. సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గత వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతర మహోత్సవాలు శనివారంతో ముగిసాయి.

16న మారువారం..

అమ్మవారి మారువారాన్ని పురస్కరించుకుని ఈ నెల 16న 108 రకాల వంటకాలతో అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నారు. 17 మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం వద్ద ఐదు వేల మంది భక్తులకు మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

భారీ అన్నదానం..

జగదాంబ : శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని జీవీఎంసీ 35వ వార్డులో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూర్ణామార్కెట్ వద్ద దుర్గాలమ్మ అమ్మవారి జాతర నేపథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి పాల్గొని అన్నదానం చేశారు. దుర్గాలమ్మ జాతర సందర్భంగా అన్నదానం చేయడం సంతోషకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు సుబ్రహ్మణ్యం, వెంకట విజయ్, చిట్టిబోయిన విజయ్, రమణమ్మ, చిన్ని తదితరులు పాల్గొన్నారు.



అలరించిన సాంస్కృతిక ప్రదర్శన



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి

వాకర్స్ క్లబ్‌లోకి ఆహ్వానం

మద్రిపాలెం: మురళీనగర్ వాకర్స్ క్లబ్ నెలవారీ సర్వసభ్య సమావేశాన్ని శనివారం క్లబ్ సభా ప్రాంగణంలో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించారు. పర్యావరణానికి ప్రాధాన్యమిస్తూ, క్రమశిక్షణ కార్యాచరణతో కొనసాగుతున్న వాకర్స్ క్లబ్‌లో నూతన సభ్యులకు ఆహ్వానం పలుకుతున్నామని నిర్వాహకులు తెలిపారు. సీనియర్ సభ్యుల వారసులు, స్థానికులు ఎవరైనా చేరవచ్చని, క్లబ్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి న్యాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు పి.వరలక్ష్మి మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొనే న్యాయ సంబంధమైన వివాదాలపై సందేహాలు, వాటి పరిష్కారాలపై వివరించారు. వీలునామా తదితర విషయాలను తెలియజేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా వరలక్ష్మిని క్లబ్ సభ్యులు సత్కరించారు. నూతన సభ్యుల చేత వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం ప్రమాణ స్వీకారం చేయించారు. వాకర్స్ జిల్లా 101 ఎలెక్ట్ గవర్నర్ ద్వారకానాథ్ వాకర్స్ క్లబ్ మాసపత్రిక 'వాకర్స్ వాయిస్' మార్చి నెల సంచికను ఆవిష్కరించారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం జియాలజీ విభాగం విద్యార్థులను వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి అభినందించారు. ప్రాంగణ నియామకాలలో భాగంగా విభాగ విద్యార్థులు ఎస్.వి.పి భాగ్యశ్రీ, షేక్ అబిదలు జెడబల్యూస్ సంస్థలో, ఆర్.స్వరూప ఏక్సెంచర్ సంస్థలో ఎంపికయ్యారు. విభాగ విద్యార్థి ఎస్.పవన్ యూపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో జియో సైంటిస్ట్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థులను వీసీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, జియాలజీ విభాగాధిపతి ఆచార్య కె.సత్యనారాయణ రెడ్డి, బీవోఎస్ చైర్మన్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయ రావు తదితరులు పాల్గొన్నారు.